క్లుప్తంగా

మార్కెట్‌లో సందడి



అమ్మకానికి సిద్ధంగా గణేశ్ ప్రతిమలు

కెరమెరి: వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్‌లో సందడి కనిపించింది. వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు జనం అధికసంఖ్యలో వచ్చారు. కొనుగోలుదారులతో ఆయా దుకాణాలు కిటకిటలాడాయి.

ప్లాస్టిక్‌పై పట్టింపేది..?



జలపాతం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు

తిర్యాణి: మండలంలోని చింతలమాదర జలపాతం వద్ద ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. సందర్శకులు ఇష్టానుసారంగా ప్లాస్టిక్ వస్తువులను వినియోగించి జలపాతం సమీపంలోనే వ్యర్థాలను పడేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో జలపాతం వద్ద కుప్పలుతెప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి.

నానో యూరియాతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న ఏవో

దహెగాం: నానో యూరియా వాడకం వల్ల అధిక లాభాలు ఉంటాయని ఏవో రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ కార్యాలయ ఆవరణలో నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా వాడకం వల్ల ఖర్చు తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కాలుష్యం కలుషితం కాదన్నారు. సాగు విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వంశీ, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల నిరసన

బెజ్జూర్: యూరియా కోసం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ఎదుట మంగళవారం రైతులు నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు వారికి మద్దతు తెలిపారు. అర్షద్ హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

కాగజ్‌నగర్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి గ్రామంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

‘వికాసం పాఠశాల దివ్యాంగులకు వరం’

ఉట్నూర్‌రూరల్: వికాసం ఆశ్రమం పాఠశాల ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు వరమని అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు బ్యాట్మింటన్ కోచ్ కబీర్‌దాస్ అన్నారు. మంగళవారం స్థానిక వికాసం ఆశ్రమం పాఠశాలను సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆయనను జిల్లా గిరిజన క్రీడాధికారి పార్థసారధి, డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు వికాస్, పీడీ జలపతి, ఆర్చరీ శిక్షకులు అశోక్ ఘనంగా సన్మానించారు.

పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం

భీంపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం జరిగిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.

పల్లె కూలీకి ‘ఉపాధి’



ఝరిలో ఉపాధిహామీ కింద నిర్మించిన షెడ్డు

- యూనిట్ల వారీగా నిధులు
- వ్యవసాయ రంగానికి ఊతం
- అన్నదాతలకు మరింత మేలు
- వినియోగించుకుంటే లాభం

కెరమెరి: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి సొంత ఊర్లలో ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం అమలు చేస్తోంది. కాలానుగుణంగా పలు నూతన పనులను పథకంలో చేర్చుతూ కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. గ్రామాల్లో చెరువులు, కాలువల వద్ద మొక్కలు పెంపకం చేపట్టడంతోపాటు రెండేళ్లగా పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటోంది. రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటే లాభాలు పొందవచ్చని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. మండలంలోని 31 గ్రామపంచాయతీల పరిధిలో 10,310 జాబ్‌కార్డులుండగా, 8,370 యాక్టివ్‌లో ఉన్నాయి. 14,230 మంది కూలీలున్నారు.



కెరమెరిలో నిర్మించిన పశువుల పాక

యూనిట్లు.. నిధులు

పౌల్ట్రీ షెడ్లు: ఈ యూనిట్ విలువ రూ.85 వేలు. రైతు షెడ్డు నిర్మించుకుని 100 నాటు కోడిపిల్ల లను పెంచాల్సి ఉంటుంది.

పశువుల పాకలు: యూనిట్ విలువ రూ.96 వేలు. తప్పనిసరిగా మూడు పశువులు ఉన్నవారికే ప్రాధాన్యత కల్పిస్తారు.

మేకలు, గొర్రెల షెడ్లు: యూనిట్ విలువ రూ.98వేలు. 10 గొర్రెలు లేదా మేకలు ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఇంకుడుగుంతలు: యూనిట్ విలువ రూ.6,500.

అజొల్లా పెంపకం: యూనిట్ విలువ రూ.20 వేలు. రైతులకు మాత్రమే ఇది వర్తిస్తుంది.

వర్మీ కంపోస్టు గుంతలు: యూనిట్‌కు విలువ రూ.15 వేలు. (సామూహికంగా లేదా వ్యక్తిగతంగా రైతులు ఈ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చు)

ఇవీ నిబంధనలు

ఎస్సీ, ఎస్టీ రైతులకు సాగులో లేని భూముల అభివృద్ధి, రైతులకు ఉపయోగపడే పలు వ్యక్తిగత పనుల కోసం ఉపాధిహామీ పథకాన్ని వినియోగించుకోవచ్చు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం మంజూరైన పనులు చేయాల్సి ఉంటుంది. వివిధ యూనిట్లకు కూలి, సామగ్రి ఖర్చులు కలిపి అందించనున్నారు. మండల స్థాయిలో ఏపీవో, ఈసీ, టీఏ లేదా గ్రామస్థాయిలో క్షేత్రసహాయకులు లేదా పంచాయతీ కార్యదర్శులకు కావాల్సిన ధ్రువపత్రాలు జత చేసి దరఖాస్తులు అందించాలి.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ పథకంలో వ్యవసాయంలో ఉపయోగపడే పనులు మంజూరు చేస్తున్నాం. రైతులు ఆయా మండలాల్లోని సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

– మల్లయ్య, ఏపీవో

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని, వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులు వేచి ఉండేందుకు రెస్ట్ రూం ప్రారంభించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్‌తో పోటీ పడాలని, సాంకేతిక రంగం వైపు అడుగులు వేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాల్లో పీఎం శ్రీ పథకం కింద అన్ని వసతులు కల్పించిందన్నారు. సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా అధికారి నాందేవ్, ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



కాగజ్‌నగర్‌టౌన్: మాట్లాడుతున్న సీఐ ప్రేంకుమార్



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న సీఐ కుమార స్వామి

కాగజ్‌నగర్‌టౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, వినాయక మండపాల కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు విద్యుత్, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలని సూచించారు. సీఐ ప్రేంకుమార్ మాట్లాడుతూ వినాయక మండపాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పెంచికల్‌పేట్: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి అన్నారు. పెంచికల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు మండపాల వివరాలను పోలీసులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్ కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

బెజ్జూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ రామ్మోహన్, కౌటాల సీఐ సంతోష్ కుమార్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. డీజేలకు అనుమతి లేదన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, గౌరీ శంకర్, ఎస్సై సర్తాజ్ పాషా, బెజ్జూర్ విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్ అజయ్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి వైకుంఠం, సుధాకర్ గౌడ్, నరేందర్ గౌడ్, అమీరుద్దీన్, శౌకత్ అలీ, గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



బెజ్జూర్: శాంతి కమిటీ సమావేశానికి హాజరైన మండపాల నిర్వాహకులు

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



పెంచికల్‌పేట్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టిగణపతులతో విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: వినాయక చవితి పురస్కరించుకుని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం మాట్లాడుతూ రసాయన పదార్థాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నదులు, చెరువులలోని నీరు కలుషితమై అనేక అనార్థాలు సంభవిస్తున్నందున మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించాలని సూచించారు. అనంతరం మట్టితో తయారు చేసిన విగ్రహాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ జనార్దన్, అధ్యాపకులు రాజేశ్వర్, శారద, వెంకటేశ్వర్, దత్తాత్రేయ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో మట్టి గణపతులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మట్టి గణపతులు తయారు చేశారు. ఈసందర్భంగా హెచ్ఎం యాదగిరి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులను తయారు చేయాలన్నారు. ప్రతీ ఇంట్లో మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, బడే సాహెబ్, గంగాభవాని, లక్ష్మీ, అఫ్తాబ్, భాగ్యశ్రీ, లక్ష్మీ, ఉజ్వల, ధనరాజ్, ఆత్మరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

పెంచికల్‌పేట్: మండలంలోని ఎర్రగుట్ట గ్రామానికి చెందిన అత్రం పోషన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్న ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబానికి రూ. 6వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు చౌదరి శ్రీనివాస్, శంకర్ గౌడ్, ఇస్మాయిల్, మల్లయ్య, రఘునాథ్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

పార్థివదేహానికి నివాళులు

బెజ్జూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి రాజేశం మంగళవారం మృతిచెందాడు. ఈ విషయంతెలుసుకున్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వారి నివాసానికి చేరుకున్నారు. ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

‘యూరియా పంపిణీకి నిబంధనలా..?’

ఆసిఫాబాద్‌అర్బన్: యూరియా పంపిణీకి నంబంధనలు ఎందుకని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి ప్రశ్నించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు అల్లాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే సమస్య ఏర్పడిందని విమర్శించారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియాను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రకాశ్, దివాకర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహణ

బజార్‌హత్నూర్: మండలంలోని టెంబి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ దివ్యవాణి, హెల్త్‌అసిస్టెంట్ రమేశ్, ఏఎన్ఎం విజయ, ఉపాధ్యాయుడు లింగారెడ్డి, ఆశ సీతాబాయి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

లింగాపూర్: జైనూర్ మండలం ఆశేపల్లి గ్రామానికి చెందిన గర్భిణీ సంగీతకు మంగళవారం పురుటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబీకులు జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి సిబ్బంది సూచన మేరకు ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది ఆమెకు పురుడు పోశారు. ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కాగా, తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ ప్రశాంత్, పైలట్ రవి తెలిపారు.



శిశువుతో 108 సిబ్బంది

కలప అక్రమ రవాణాలో అంతర్గత విచారణ?

బెజ్జూర్: కలప అక్రమ రవాణాలో అటవీశాఖ అధికారులు బెజ్జూర్‌లో అంతర్గత విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ‘సాక్షి’లో ఈనెల 25న ‘పట్టుబడిన కలప పక్కదారి’ శీర్షికన కథనం ప్రచురితం కాగా అటవీశాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. మండల కేంద్రంలో పది రోజుల క్రితం ఓ కార్పెంటర్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కలప, కార్పెంటర్ సామగ్రిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని రేంజ్‌కు తరలించారు. సదరు కార్పెంటర్‌కు రూ. 18వేలు చలానా విధిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. దీంతో సోమవారం చలానా చెల్లించడానికి వెళ్లిన కార్పెంటర్ వద్ద నుంచి చలానా పేరుతో అటవీశాఖ అధికారులు రూ. 55వేలు వసూలు చేశారు.

మిగతా కలప ఎక్కడ..?

బెజ్జూర్ రేంజ్ పరిధిలోని ఇందిర్‌గాం బేస్‌క్యాంప్ వద్ద పెద్ద టేకు చెట్టును అటవీశాఖలో పనిచేస్తున్న కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. వారి వద్ద నుంచి ఎలాంటి రశీదులు లేకుండా జరిమానా వసూలు చేశారు. నిబంధనల ప్రకారం రశీదు తీసుకున్న కలపను డిపోకు తరలించాల్సి ఉంది. అయినా కూడా బేస్ క్యాంప్ సిబ్బందితో కలిసి రేంజ్ పరిధిలో పనిచేస్తున్న ఓ అధికారి కలపను బెజ్జూర్‌లోని కార్పెంటర్‌కు తన సొంత అవసరానికి అప్పగించి ఇంటి తలుపులు తయారు చేయమన్నాడు. తన శాఖలో పనిచేస్తున్న కొంత మంది సిబ్బందితో ఈవిషయం బయటకు రావడంతో తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి అటవీశాఖ అధికారులు కార్పెంటర్ ఇంటిపైన దాడులు నిర్వహించి కలపతో పాటు, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. రూ.18వేలు చలానా చెల్లించాలని చెప్పడంతో అక్కడికి వెళ్లిన కార్పెంటర్ వద్ద నుంచి రూ. 55వేలు చలానా వసూలు చేశారు. చెట్టు నుంచి కేవలం ఒకే ముక్కను కార్పెంటర్‌కు అప్పగించిన అటవీశాఖ సిబ్బంది సుమారు రూ.2లక్షలు విలువ చేసే మిగతా కలపను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. అటవీశాఖ ఉన్నతాధికారులు కుశ్నపల్లి సెక్షన్ పరిధిలోని ఇందిర్‌గాం బీట్‌లో విచారణ చేపడితే అసలు దొంగల పాత్ర తేలుతుందని మండలవాసులు కోరుతున్నారు.



అటవీశాఖ అధికారులు ఇచ్చిన రశీదు

రెండోరోజుకు ఆమరణ నిరాహార దీక్ష

వాంకిడి: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు గోవింద రావు, బోనగిరి సతీశ్ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో మండల కేంద్రంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరింది. ఆయనకు మద్దతు తెలిపి వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతూ పేద ప్రజలకు అన్యాయం చేస్తోందని, ఆర్థికంగా స్థిరపడిన, భూస్వాములకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు చీదర్ల నరేశ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు మండోకార్ వికాస్, నాయకులు పైసెట్టి వేణు, దుర్గం అక్షయ్, గణేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకుడు గోవిందరావు

ఘనంగా గురుగుల నిమజ్జనం



గురుగుల నిమజ్జనానికి వెళ్తున్న మహిళలు



వాగు వద్ద నిమజ్జనం చేస్తున్న మహిళలు

దహెగాం: మండలంలోని పీకలగుండం గ్రామంలో గురుగుల నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పొలాల అమవాస్య రోజున మట్టితో బసవన్నలను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మరుసటి రోజు బసవన్నలను సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు గురుగులను నోముకుంటారు. నోముకున్న గురుగులకు రెండు రోజుల పాటు పూజలు నిర్వహించారు. మంగళవారం బిందెలలో గురుగులను పెట్టుకొని బ్యాండు మేళాలతో వాగుకు వెళ్లి పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

బేస్‌లైన్ రికార్డులు నమోదు చేయాలి

కెరమెరి: ప్రతీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్ట్ రికార్డులు నమోదు చేయాలని కెరమెరి, ఝరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, భరత్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లోకల్‌బాడీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మొక్కలు నాటించి వాటికి క్యూఆర్ కోడ్, ట్రీగార్డ్ తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న కాలంలో క్యూఆర్ కోడ్‌తో ఆ మొక్క పరిస్థితిని కేంద్రం పరిశీలించనుందని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ విధిగా నమోదు చేయాలని తెలిపారు. చెక్ ఇన్, చెక్ అవుట్ సరైన సమయంలో చేసుకోవాలని పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ ఎప్పుడైనా మండలానికి తనిఖీ నిమిత్తం వచ్చే అవకాశం ఉందని, అందుకు హెచ్ఎంలు అన్ని రికార్డులతో సిద్ధంగా ఉండాలని, విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు, చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

దాతల సహకారంతో ఆర్థికసాయం



బాండ్ అందజేస్తున్న సీఐ కుమార స్వామి

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన కొడప నవదీప్ ఇటీవల పాము కాటుతో మృతి చెందాడు. మంగళవారం దాతల సహాయంతో సేకరించిన రూ. 50వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమార స్వామి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట ఎస్సై అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ దుర్గం రాజన్న, గ్రామస్తులు ఉన్నారు.

వినాయక చవితికి మండపాలు ముస్తాబు

కాగజ్‌నగర్‌టౌన్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతీ కూడలి, గల్లీల్లో ఉత్సవాల మండపాలను ముస్తాబు చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ, ఇందిరా మార్కెట్, ద్వారకానగర్, సంజీవయ్య, శ్రీకృష్ణనగర్‌తో పాటు ఆయా కాలనీల్లో వినాయక చవితికి మండపాలను విద్యుత్ దీపాలు, వివిధ రకాల అలంకరణలతో ముస్తాబు చేశారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన మండపం



సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయ్‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899